సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 8 । జనవరి । 2023



సత్ఫలితాలిస్తున్న కోర్టు మానిటరింగ్ సెల్

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోర్టు మానిటరింగ్ సెల్ సత్ఫలితాలిస్తోంది. -IIలో



వైద్యులు గ్రామాల్లో సేవలందించాలి

శిక్షణలో ఉన్న వైద్యులు తర్వాత గ్రామాలకు వెళ్లి సేవలందించాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి తెలిపారు. -IIలో

గరిష్టం/కనిష్టం
30.0/17.7

వాతావరణం

జిల్లాలో శనివారం 17.7 - 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రజల సౌకర్యార్థం జనవరి 10వ తేది నుంచి అందుబాటులోకి రానున్న 1967 ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 1800 425 0082/1967 (పౌరసరఫరాల శాఖ), 1800 425 3157/14445 (ఒకే దేశం ఒకే రేషన్‌కార్డు), 1800 425 2388/155 235 (రాష్ట్ర ఆహార కమిషన్), 1800 425 4202 (తూనికలు కొలతల శాఖ) ఈ అన్ని టోల్‌ఫ్రీ నెంబర్లకు 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌కు అనుసంధానం చేశారన్నారు. ప్రజలు ఈ కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈనెల 10వ తేదిన ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతిరోజు అందుబాటులో ఉంటుందని ఆయన వివరించారు.

మాతా శిశు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

కడప రూరల్: మాతా శిశు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మాతా శిశు ఆరోగ్యంను పెంపొందించి తల్లుల జీవితాలలో చిరునవ్వులు చిందించడానికి కిల్కారి మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ సేవల గురించి ఏఎన్ఎం, ఆశాలు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గర్భవతులు, బాలింతలు, అందరికీ తెలియపరచాలన్నారు. ఈ యాప్ ద్వారా అందించే మాతా శిశు సేవలు 0124458000 నంబరు ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ వాయిస్ కాల్ ఒక నిమిషం నుంచి 30 సెకండ్ల పాటు ఉంటుందన్నారు. ఈ వాయిస్ కాల్ ద్వారా గర్భవతి నాలుగవ నెల నుంచి బిడ్డకు ఒక ఏడాది వయసు వచ్చే వరకు మాతా శిశు ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సేవలు అందజేస్తారన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడే ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భవతి మొబైల్ నంబరును తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు.

దొరసానిపల్లె పంచాయతీని పరిశీలించిన కేంద్ర బృందం

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని దొరసానిపల్లెలో అభివృద్ధి పనులను కేంద్ర బృందం శనివారం పరిశీలించింది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దొరసానిపల్లె గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. దీంతో ఈ గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో అధికారులతో సెంట్రల్ గుడ్ గవర్నెన్సీ సెక్రటరి రాజేష్ సమావేశం నిర్వహించారు. శాఖల వారిగా అమలు అవుతున్న పథకాలు, వివిధ పనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజి, విద్యుత్ సరఫరా ఎలా ఉందనే దానిపై అధికారులు, ప్రజలతో మాట్లాడారు. ఆరోగ్యశాఖకు సంబంధించి ఎలాంటి పథకాలు అమల్లో ఉన్నాయి, అవి ప్రజలకు ఎలా చేరువ అవుతున్నాయో ఆశ,హెల్త్ సూపర్‌వైజర్లు వివరించారు. మాతాశిశు సంరక్షణ, ఆరోగ్యశ్రీ గురించి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచి వాలయ, వలంటీర్ వ్యవస్థ గురించి వలంటీర్లు వివరించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలపై అధికారులు వివరించారు. గ్రామంలో అభివృద్ధి పనులపై సీజీజీ సెక్రటరి రాజేష్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీపీ శేఖర్, సర్పంచ్ ఈశ్వరమ్మ, డీఎల్‌డీఓ సుబ్రమణ్యం, ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారద పాల్గొన్నారు.

- వైఎస్సార్ స్టీల్ కార్పోరేషన్ లిమిటెడ్ భూమి పూజకు సన్నాహాలు
- జేఎస్‌డబ్ల్యు స్టీల్ లిమిటెడ్‌కు 3148 ఎకరాలు భూమి అప్పగింత
- రూ.713 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- రైల్వే కనెక్టివిటీ కోసం 9.4 కిలో మీటర్లు రైల్వేలైన్ నిర్మాణం
- 7.5 కిలోమీటర్ల మేరకు ఫోర్‌వే రోడ్డు ఏర్పాటు
- మైలవరం జలాశయం నుంచి రెండు టీఎంసీల నీరు సరఫరా
- ఫేజ్-1లో రూ.3300 కోట్ల పెట్టుబడులు

యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం



స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు

సాక్షి ప్రతినిధి, కడప: అండగా నిలిచిన ప్రాంతం శాశ్వత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. నిరుద్యోగం పారదోలి మెరుగైన జీవనోపాధి కల్పించాలనే ఆశయంతో సొంత జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో నాలుగులేన్ల రోడ్డు, ట్రైన్ కనెక్టివిటీ, నీటి వసతి, విద్యుత్ సరఫరా పనులు వేగవంతం అయ్యాయి. మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం శరవేగంగా స్పందిస్తోంది. వైఎస్సార్ స్టీల్ కార్పోరేషన్ లిమిటెడ్ భూమిపూజకు వడివడిగా అడుగులు పడుతున్నాయి.

పట్టించుకోని టీడీపీ..

వెనుకబాటుకు గురైన రాయలసీమ నడిబొడ్డున కడప గడపలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విభజన చట్టంలో పొందుపరిచారు. తద్వారా నిరుద్యోగులకు మెరుగైన జీవనం లభిస్తోందని అనుబంధ పరిశ్రమలు ద్వారా మరింత ఉపాధి లభిస్తుందని తలిచారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించింది. తీరా ఎన్నికలకు ముందు 2018లో ఓ పునాది రాయితో చంద్రబాబు సర్కార్ సరిపెట్టింది.

బాధ్యతగా వైఎస్ఆర్‌సీపీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్టీల్ ప్లాంట్ నిర్మించాలనే ఆశయాన్ని భుజానికెత్తుకుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 డిసెంబర్ 23న స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ లిమిటెడ్ పేరిట నిర్వహణకు సన్నహాలు చేపట్టారు. కాగా 2020 ఫిబ్రవరి నుంచి కరోనా వైరస్ వ్యాప్తితో ప్రపంచమే అతలాకుతలమైంది. మానవుల జీవనం అస్తవ్యస్తంగా తయారయింది. రెండేళ్ల పాటు ఇలాంటి పరిస్థితి కొనసాగుతూ రావడంతో ప్లాంట్ నిర్మాణానికి ప్రతిబంధకంగా మారిందని నిపుణులు వివరిస్తున్నారు.

జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్‌కు భూమి అప్పగింత

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల చేపట్టిన జిల్లా పర్యటనలో జేఎస్‌డబ్ల్యు స్టీల్స్ లిమిటెడ్ ద్వారా జమ్మలమడుగు సమీపంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఈనెలలో భూమి పూజ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కాగా జీఓ ఎంఎస్ నంబర్ 751 ద్వారా ఎకరం రూ.1.65 లక్షలతో 3,148.68 ఎకరాలు కేటాయిస్తూ 2022 డిసెంబర్ 16న ఉత్తర్వులు జారీ చేశారు.

- ఈ స్టీల్ ప్లాంట్ తొలివిడతలో ఏడాదికి 1 మిలియన్ టన్నులు (10 లక్షల టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం కానుంది. అందుకోసం ఫేజ్-1లో రూ.3,300 కోట్లు వెచ్చించనున్నట్లు అధికార యంత్రాంగం స్పష్టం చేస్తున్నారు. 36 నెలల కాలపరిమితిలో ఫేజ్-1 పనులు పూర్తి కానున్నాయి. తొలివిడతలో వైర్ రాడ్స్ మరియు బార్ మిల్స్ ఉత్పత్తి చేయనున్నారు. మరో రూ.5.500 కోట్లుతో ఫేజ్-2 నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఫేజ్-2 సైతం 2029 మార్చి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

మౌలిక వసతుల కల్పన

స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.713 కోట్లు వెచ్చిస్తోంది. నాలుగులైన్ల రహదారి, రైల్వే కనెక్టివిటీ, నీటి వసతి కోసం పైపు లైన్ ఏర్పాటు, నిల్వ చేసుకునేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, భవన సముదాయం నిర్మించనున్నారు. అందులోభాగంగా ఎన్‌హెచ్-67 నుంచి ముద్దనూరు టు జమ్మలమడుగు రోడ్డుకు అనుసంధానంగా రూ.145.3 కోట్లతో 12 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారి నిర్మించనున్నారు.

- యర్రగుంట్ల టు ప్రొద్దుటూరు రైల్వేలైన్ నుంచి రూ.323.5 కోట్లతో 9.4 కిలో మీటర్లు రైల్వేలైన్ నిర్మాణం చేపట్టనున్నారు. మైలవరం జలాశయం నుంచి 2 టీఎంసీల నీరు సరఫరా చేయనున్నారు. అందుకోసం 15 కిలోమీటర్లు పైపులైన్ నిర్మించనున్నారు. ఇప్పటికే విద్యుత్ సరఫరాకు కావాల్సిన చర్యలు పూర్తయ్యాయి.
- రూ.76.42 కోట్లతో 27 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైన్ ఏర్పాటు, 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి అయింది. 20 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సంప్ నిర్మాణం ఫినిషింగ్ దశలో ఉంది. చుట్టూ ప్రహరీ, భవన సముదాయం వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. ఇంటర్నల్ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ స్టీల్ కార్పోరేషన్ లిమిటెడ్ స్టీల్ ప్లాంట్ భూమిపూజ నాటికి కావాల్సిన మౌలిక వసతుల కోసం వడివడిగా పనులు చేస్తుండడం విశేషం. కాగా అధికారికంగా సీఎం వైఎస్ జగన్ పర్యటన ఖరారు కావాల్సి ఉంది.



రూపుదిద్దుకున్న విద్యుత్ సబ్‌స్టేషన్

యువతకు ఉపాధి కల్పించడమే సీఎం లక్ష్యం

పారిశ్రామికాభివృద్ధి సాధించి జిల్లాలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే కృతనిశ్చయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో మెండుగా ఉంది. ఆ మేరకే స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సమగ్ర, స్పష్టమైన ప్రణాళికతో భూమి పూజకు సిద్ధమౌతున్నారు. అటు కొప్పర్తి పారిశ్రామికవాడ, ఇటు వైఎస్సార్ స్టీల్ కార్పోరేషన్ లిమిటెడ్‌తో జిల్లా రూపురేఖలు మారనున్నాయి. లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో భవిష్యత్‌లో జమ్మలమడుగు పెద్ద సిటీగా చూడనున్నాం.



- వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎంపీ



నిర్మాణ దశలో ఉన్న షెడ్డు

వేడుకగా గ్రాడ్యుయేషన్ డే



హాజరైన విద్యార్థినులు



మాట్లాడుతున్న కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్

- 200 మందికి పట్టాలు పంపిణీ
- 15 మంది ప్రతిభావంతులకు గోల్డ్‌మెడల్స్ అందజేత
- ప్రదానం చేసిన కళాశాల విద్య కమిషనర్ డా. పోలా భాస్కర్

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తొలి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల విద్య కమిషనర్ డా. పోలా భాస్కర్‌కు ఎన్‌సీసీ కేడెట్స్ నుంచి గార్డ్ ఆఫ్ హానర్ లభించింది. అనంతరం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ డిగ్రీ పట్టాలు, బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పట్టుదలగా మరింత శ్రమించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరే క్రమంలో రాజీలేకుండా శ్రమించి సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ కళాశాల ఉన్నత విలువలు, చక్కటి విద్యను అందిస్తూ మహిళా సాధికారత దిశగా సాగుతోందన్నారు. విద్యార్థులు ఉన్నతశిఖరాలు చేరుకోవాలని సూచించారు. అనంతరం 2017-20 విద్యాసంవత్సరాలకు సంబంధించి 200 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వివిధ గ్రూపుల్లో టాపర్స్‌గా నిలిచిన 15 మంది విద్యార్థినులకు బంగారు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో వైవీయూ ఆచార్యులు డా. ఎం.వి.శంకర్, డా. లోకా సుబ్రమణ్యంశర్మ, ఉన్నతవిద్య కడప ఆర్‌జేడీ డా. బాబు, అనంతపురం ఆర్‌జేడీ నాగలింగారెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, కళాశాల పాలకమండలి సభ్యులు ఆచార్య జి. గులాంతారీఖ్, పి. అరుణకుమారి, టి. శివశంకర్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమగ్ర వార్షిక ప్రణాళిక సిద్ధం చేయండి

కడప ఎడ్యుకేషన్: పిల్లల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని వారి అభివృద్ధికి ఉపకరించే చక్కని వార్షిక ప్రాణాళికలను తయారు చేయాలని సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ దేవరాజు పేర్కొన్నారు. శనివారం కడప లోని స్కౌట్ హాలులో వార్షిక బడ్జెట్ 2023 - 24 తయారీపై మండల విద్యాశాఖ అధికారులకు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు , స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, జిల్లా ఎంఐఎస్ కో ఆర్డినేటర్ లక్ష్మి నరసింహరాజు అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు, విద్యార్థుల ప్రగతికి అవసరమైన వార్షిక ప్రణాళికలను జాగ్రత్తగా తయారు చేయాలని సూచించారు. డీఈఓ కార్యాలయ ఏఎస్ఓ బ్రహ్మానందరెడ్డి, జ్వాలాపతి, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు కేశవరెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

చదువును మించిన ఆస్తి లేదు

సిద్దవటం: చదువును మించిన ఆస్తి ఏదీ లేదని సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలం లోని భాకరాపేట, 11వ బెటాలియన్, సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈఓ శంకరయ్య పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వ్యవస్థాపక దినోత్సవం



విద్యార్థులు రూపొందించిన కళాకృతులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ సూర్యకళావతి, రిజిస్ట్రార్ సురేంద్రనాథ్‌రెడ్డి

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం 3వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటైన అతి తక్కువ కాలంలోనే చక్కటి ప్రగతి సాధించిందన్నారు. వినూత్న కోర్సులు, ఉపాధి కల్పించే కోర్సులతో రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిందన్నారు. రానున్న రోజుల్లో విశ్వవిద్యాలయం అన్ని సౌకర్యాలు సమకూర్చుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజాప్రతినిధుల సహకారంతో త్వరలోనే విశ్వవిద్యాలయానికి శాశ్వత భవనాలు సమకూర్చుకుంటామని తెలిపారు. విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతిని ఆర్జించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ కాంపిటీషన్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వైస్ చాన్సలర్ పదవీకాలం పూర్తి కావడంతో ఆచార్య మునగల సూర్యకళావతిని విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

వైవీయూ అనుబంధ కళాశాలలకు సెలవులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు, జీసీటీఏ నాయకుల వినతి మేరకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువరించారు.

గాయపడ్డ మహిళ మృతి


రహమత్‌బీ (ఫైల్)

పోరుమామిళ్ల : అగ్ని ప్రమాదంలో గాయపడిన షేక్ రహమత్‌బీ(53) చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. పట్టణంలోని పాత పోస్టాఫీసు వీధిలో ఈ నెల 3న గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో ఆమె తీవ్రంగా గాయపడగా కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృత్యువాత పడింది. ఇదే సంఘటనలో తీవ్రంగా గాయపడిన రజియాబీ కర్నూలు జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. రహమత్‌బీకి భర్త, కుమారుడు ఉన్నారు. భర్త చిన్న ఖాదర్‌వలి పెయింటర్‌గా పని చేస్తున్నాడు.

చికిత్స పొందుతూ..


మృతి చెందిన సాంబశివారెడ్డి

ఎర్రగుంట్ల : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎర్రగుంట్ల ఎస్ఐ వెంకటక్రిష్ణయ్య తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని టి.సుంకేసుల గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి(60) శుక్రవారం కడప రోడ్డులోని అయ్యప్ప స్వామి గుడి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సత్ఫలితాలిస్తున్న కోర్టు మానిటరింగ్ సెల్

- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యం
- నిందితులకు సత్వరం శిక్ష
- బాధితులకు న్యాయం


కడపలో కోర్టు మానిటరింగ్ సెల్ ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ (ఫైల్)

కడప అర్బన్ : జిల్లాలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోర్టు మానిటరింగ్ సెల్ సత్ఫలితాలిస్తోంది. పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా ఈ విభాగాన్ని రూపొందించారు. కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 2022లో ఈ కేంద్రం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పర్యవేక్షణలో మధుసూదన్‌రావు అనే సీఐని ఇన్‌చార్జి అధికారిగా నియమించారు. ఆయన ఆధ్వర్యంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. కోర్టులకు అవసరమైన సమాచారం అందజేస్తూ నేరస్తులకు శిక్ష పడేలా చేయడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు.

- ఈ విభాగం ద్వారా జిల్లాలో మొత్తం 42 ప్రధానమైన కేసుల్లో కోర్టు తీర్పుల ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా తమ వంతుగా శ్రమించారు. వీటిలో ఓ హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష, రెండు కేసుల్లో జీవితఖైదు, 32 కేసుల్లో ఏడాది, 5 లేక 6 నెలలపాటు, ఓ కేసులో నాలుగు నెలలు శిక్ష పడేలా చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేశారు.
- 2021లో 4470 కేసులు విచారణలో వుండగా 2600కు తగ్గించి గణనీయమైన పురోగతి సాధించారు. 16,947 కేసుల దర్యాప్తు పూర్తి చేసి లక్ష్యాన్ని అధిగమించారు. సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేశారు.
- జిల్లాలో పలు దఫాలుగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో ఇరు వర్గాల వారిని పిలిపించి కేసులను పరిష్కరించారు. వారి రాజీ పిటీషన్లను జాతీయ లోక్ అదాలత్‌లలో నిబంధనల మేరకు జారీ చేయించడంలో కోర్టు మానిటరింగ్ సెల్ విశేషంగా కృషి చేసింది.
- మొత్తం 17899 కేసులను పరిష్కరించారు. వీటిలో 13,191 దర్యాప్తు కేసులు, 4,708 పి.టి కేసులు వున్నాయి.
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నిరంతర పర్యవేక్షణలో కన్విక్షన్ బేస్ట్ పోలీసింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ విధానం ప్రధాన ఉద్దేశం కోర్టులో కేసు విచారణ వడివడిగా జరిగి నేరస్తులకు శిక్ష పడేలా చేయడం. అలా శిక్షపడినపుడే బాధితులకు న్యాయం జరుగుతుంది. నేరస్తులకు శిక్ష పడేలా సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టడం, ఎన్.బి.డబ్ల్యూలు సకాలంలో అమలు చేయడం, అత్యాచార, పోక్సో కేసుల్లో నిర్దేశిత కాలంలో చార్జ్‌షీట్ దాఖలు చేయడం వంటి కీలక అంశాల్లో జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తూ శిక్షా శాతం పెరిగేలా కృషి చేస్తున్నారు.

ప్రతి కేసును మానిటరింగ్ చేస్తున్నాం

ప్రతి కేసును మానిటరింగ్ చేయిస్తున్నాం. సాక్షులు సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా చేయడం, నాన్ బెయిలబుల్ వారెంట్స్, సమన్లు జారీపై కోర్టు ఆదేశాలను పాటించేలా చూస్తున్నాం.

– జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

జిల్లా వ్యాప్తంగా 336 న్యాయ విజ్ఞాన సదస్సులు


మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శనివారం 336 న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. శనివారం విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు, వన్‌స్టాప్ సెంటర్, దిశా పోలీసు, డిస్ట్రిక్ట్ పంచాయతీ ఆఫీసు, ఉమెన్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, పారా లీగల్ వలంటీర్లు, మండల విద్యాశాఖాధికారుల సహకారంతో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. స్థానిక బృంద వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కవిత మాట్లాడారు. కడప వారు నల్సా పథకాలు, రాజ్యాంగ హక్కులు, విధులు, మహిళా సాధికారత, సాంఘిక సంక్షేమ పథకాలు, స్త్రీలు, పిల్లలు, వైకల్యాలు ఉన్న వ్యక్తులు, వయోవృద్ధులు, కుల ఆధారిత మైనార్టీలు, అక్రమ రవాణా బాధితులు, సామూహిక విపత్తులు లేదా హింసా బాధితులు అనే అంశాలపై సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న వ్యక్తులు, కార్మిక చట్టాలు, ఉపాధి పథకాలు, భూమి లేక ఆస్తి సమస్యలు, కుటుంబ విషయాలు, బాధితుల పరిహార పథకం, బాల్య న్యాయ చట్టం, ఆరోగ్యం, పోషణ, విద్య, వ్యవసాయం, నీటి వనరులు, ఆర్థిక చేరిక, నైపుణ్యం అభివృద్ధి, మౌలిక సదుపాయాలు అనే అంశాలపై సదస్సులు నిర్వహించినట్లు తెలియజేశారు. వాటి ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశామన్నారు.

కారు, స్కూటీ ఢీకొని యువకుడి దుర్మరణం


మృతి చెందిన పవన్ యాదవ్


ఫల్టీ కొట్టిన కారు

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

పులివెందుల : పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయం రింగ్ రోడ్డు సమీపంలో స్కూటీ, కారు ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలలోకి వెళితే.. పట్టణంలోని గుంత బజార్‌కు చెందిన సుధాకర్ యాదవ్ కుమారుడు పవన్ యాదవ్ (17) తన స్నేహితుడు వినయ్‌కుమార్‌రెడ్డితో కలిసి స్కూటీ వాహనంలో పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయం రింగ్ రోడ్డును క్రాస్ చేస్తున్నాడు. అటు వైపు నుంచి కారు వస్తోంది. ఈ క్రమంలో ఈ రెండు వాహనాలు ఢీకొనడంతో పవన్ యాదవ్ ఎగిరిపడి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైకులో ప్రయాణిస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డికి, అలాగే ఆ రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్న రవి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనలో కారు ఫల్టీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి కూడా గాయాలయ్యాయి. దీంతో గాయపడ్డ వారిని హుటాహుటిన స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఈడీ చదివి.. దొంగగా మారి..

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై..
- బ్యాంక్‌లో చోరీకి పాల్పడి..
- చివరికి కటకటాల పాలై..


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, పోలీసులు

జమ్మలమడుగు : బీఈడీ చదువుకున్నాడు.. ఇంటి వద్ద మగ్గం నేసుకుంటున్నాడు.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు.. ఆ డబ్బు తీర్చేందుకు దొంగగా మారి పోలీసులకు చేతికి చిక్కాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. నిందితుడి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సదాశివయ్య వెల్లడించారు. మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందిన వరదా బాలమురళి బీఈడీ పూర్తి చేశాడు. ఉద్యోగం లేకపోవడంతో ఇంట్లోనే మగ్గం నేసుకుంటూ జీవనం సాగిస్తు వచ్చాడు. ఇటీవల ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో దాదాపు పది లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. బెట్టింగ్ కోసం పది లక్షల రూపాయలు అప్పు చేశాడు. ఆ డబ్బులు తీర్చడానికి దొంగతనం చేయాలనే నిర్ణయానికి వచ్చాడు. అందులో భాగంగా డిసెంబర్ 31, జనవరి 1 తేదీలు శని, ఆదివారాలు కావడంతో బ్యాంకులకు సెలవు వచ్చింది. ఇదే అదనుగా భావించిన వరదా బాలమురళి మేనేజర్ రూంకు సంబంధించిన కిటికీ కడ్డీలను రెండు రోజుల పాటు కత్తిరించి, బ్యాంక్‌లో చోరీ చేశాడు. రెండు కంప్యూటర్లు, స్కానర్, సీసీ టీవీ మానిటర్‌లతో పాటు మరికొన్ని వస్తువులను దొంగలించాడు. 2వ తేదీ కెనరా బ్యాంక్ మేనేజర్ కుమ్మర ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలించిన వస్తువులను ప్రొద్దుటూరులో అమ్మేందుకు శనివారం ఉదయం స్థానిక బైపాస్ రోడ్డులో బస్సు కోసం వేచి ఉన్నాడు. నిందితుడిని ఎస్ఐ సుబ్బారావు, క్రైం పోలీసులు అదుపులో తీసుకున్నారు. అతని వద్ద ఉన్న కంప్యూటర్లుతోపాటు స్కానర్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైద్యులు గ్రామాల్లో సేవలందించాలి

– జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి


జేవీవీ ఆధ్వర్యంలో రిమ్స్‌లో సేవలందిస్తున్న వైద్యులు

కడప ఎడ్యుకేషన్ : శిక్షణలో ఉన్న వైద్యులు తర్వాత గ్రామాలకు వెళ్లి సేవలందించాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా జనవిజ్ఞాన వేదిక, ఐఎంఏ కడప వారి ఆధ్వర్యంలో కడప రిమ్స్‌లో నర్సింగ్, మెడికో విద్యార్థులకు నేటి వైద్యం ఆవశ్యకత– నేటి సమాజంలో వైద్యుల పాత్ర అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేవీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి, జేవీవీ గౌరవాధ్యక్షులు ప్రముఖ చర్మ వైద్యులు డాక్టర్ గోపాల్‌వర్మ మాట్లాడుతూ నేటి సమాజంలో వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారిందన్నారు. వైద్యం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలన్నారు. వైద్య వృత్తి కోసమే పరితపించాలి తప్ప వ్యాపారం కాకూడదన్నారు. ప్రజలంతా వివిధ రూపాల్లో ట్యాక్స్ ద్వారా ప్రభుత్వానికి చెల్లిస్తున్న సంపదతోనే వైద్య వృత్తిని విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతున్నామన్నారు. సదస్సులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఫరూక్, జేవీవీ జాతీయ ఉపాధ్యక్షులు విశ్వనాథ్, ఐఎంఏ కడప సెక్రటరీ డాక్టర్ వినయ్‌కుమార్, జేవీవీ రాష్ట్ర కోశాధికారి సనావుల్లా, వైఎస్సార్ జిల్లా నాయకులు మల్లికార్జున, శంకరయ్య, రాష్ట్ర సమత అధ్యక్షురాలు సుజాత, రాష్ట్ర నాయకులు మన్సూర్ బాషా, వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు నెమలి అప్పగింత

రాజంపేట : పంట పొలంలో లభ్యమైన జాతీయపక్షి నెమలిని అటవీ అధికారులకు అప్పగించారు. ఊటుకూరు గ్రామ పరిధిలోని రవిశేఖరాజు అనే రైతుకు తన పొలంలో నెమలి కదలలేని స్థితిలో శనివారం కనిపించింది. ఆయన అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది పంట పొలాల వద్దకు చేరుకొని ఆ నెమలిని ఊటుకూరు యువకులు హరికృష్ణ, అశోక్ సాయంతో రాజంపేట రేంజర్ నారాయణకు అప్పగించారు. వారు నెమలిని చికిత్స నిమిత్తం పశువైద్యశాలకు తరలించారు.

వీసీ సూర్యకళావతి సేవలు మరువలేనివి


వీసీ ఆచార్య సూర్యకళావతిని సన్మానిస్తున్న అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయాన్ని జాతీయస్థాయిలో మేటిగా నిలిపిన వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి కృషి మార్గదర్శకమని వైవీయూ అధ్యాపకులు కొనియాడారు. వైవీయూ వీసీ సూర్యకళావతి పదవీకాలం ముగియడంతో శనివారం వైవీయూ అధ్యాపక సంఘం (యూటా) ఆధ్వర్యంలో సీవీ రామన్ సైన్స్‌బ్లాక్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అన్నింటా అగ్రగామిగా నిలపడంలో వీసీ కృషి మార్గదర్శనమన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ వసతిగృహాలు, హెల్త్‌సెంటర్, గ్రీనరీతో పాటు విశ్వవిద్యాలయం ప్రగతిలో వీసీ కృషి ఎంతో ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, పూర్వపు రిజిస్ట్రార్ ఆచార్య డి.విజయరాఘవప్రసాద్, ఆచార్యులు డా. ఎస్. రఘునాథరెడ్డి, డా. వై. సుబ్బరాయుడు, డా. ఎన్. ఈశ్వరరెడ్డి, డా. పి.ఎస్. షావల్లీఖాన్, సహ ఆచార్యులు డా. కె. రామసుబ్బారెడ్డి, డా.కె. మృత్యుంజయరావు, డా. కె. లలిత, డా. ప్రమీల మార్గరేట్ తదితరులు మాట్లాడారు. అనంతరం సన్మాన గ్రహీత, వీసీ సూర్యకళావతి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేసే అవకాశాన్ని తనకు కల్పించిన ముఖ్యమంత్రికి, ప్రజాప్రతినిధులు, సహకా రం అందించిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోనే నెంబర్ 1 అయ్యే అర్హతలు వైవీయూకు ఉన్నాయని, మరిన్ని విజయాలను సొంతం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని యూటా అధ్యక్షుడు డా.కె.ఎస్.వి. కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి డా. సుభోష్‌చంద్ర, డా. రియాజున్నీసా సమన్వయం చే శారు. అనంతరం విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం వీసీని ఘనంగా సన్మానించారు. అంతకు మునుపు వీసీ చాంబర్‌లో ప్రొద్దుటూరు ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, వైవీయూ టీచింగ్ అసిస్టెంట్‌లు, బోధనేతర సిబ్బంది వీసీని ఘనంగా సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

– మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన సోము

పులివెందుల/పుట్టపర్తి టౌన్ : వైఎస్సార్ జిల్లా పులివెందుల సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి వాసి ఒకరు ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పుట్టపర్తి మున్సిపాలిటీలోని రెండో వార్డుకు చెందిన సోము (36), చంద్ర (30), గణేష్ (25)లు శనివారం ఉదయం వైఎస్సార్ జిల్లాలోని గండి ఆంజనేయస్వామి దర్శనానికి బైకుపై వెళ్లారు. స్వామి వారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా పులివెందుల సమీపంలో వీరి బైకును కారు బలంగా ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన సోము (36) అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్ర, గణేష్‌కు గాయాలయ్యాయి. వారిని పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే సోము కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతునికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నట్లు తెలిసింది.

మహిళ ఆత్మహత్య

రామాపురం : మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లెకు చెందిన మతిస్థిమితం లేని మహిళ కొండూరు దిల్షాద్ (32) శనివారం క్రిమి సంహారిణి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా సికేదిన్నె మండలానికి చెందిన దిల్షాద్‌కు 13 ఏళ్ల క్రితం అన్నమయ్య జిల్లా రామాపురం మండలం దూదేకులపల్లెకు చెందిన కొండూరు దర్బార్‌బాషాతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈమె భర్త దర్బార్‌బాషా జీవనోపాధికై గల్ఫ్ దేశానికి వెళ్లి వస్తుంటాడు. ఈ మధ్య కాలంలో ఆమెకు అప్పుడప్పుడు మతిస్థిమితం లేకుండా వీధుల్లో తిరుగుతుండేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెను చికిత్స కోసం 2022 సెప్టెంబర్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. మృతురాలి భర్త 2 నెలల క్రితం జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారింది. శనివారం క్రిమి సంహారిణి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి తీవ్ర అస్వస్థతకు గురైంది. బాధితురాలిని చికిత్స కోసం 108లో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కొన్ని పార్టీలు వారిని పావులుగా వాడుకుంటున్నాయ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్

ఎమ్మార్పీఎస్‌పై వైఎస్సార్‌సీపీ నేతల విమర్శలు

కడప కార్పొరేషన్ : కొన్ని పార్టీలు ఎమ్మార్పీఎస్ నాయకులను పావులుగా వాడుకుంటున్నాయని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు సీహెచ్ వినోద్, కే.బాబు విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మితవాది, సౌమ్యుడు అయిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషాపై ఎమ్మార్పీఎస్ నాయకుల ఆరోపణలు అర్థరహితమన్నారు. ఆయన ఎలాంటివారో నగర ప్రజలందరికీ తెలుసని, సామాన్య కార్యకర్త నుంచి ఎదిగిన అంజద్‌బాషా కులమతాలు, పార్టీలకతీతంగా సేవలందించే నాయకుడిగా పేరొందారన్నారు. తమను దుర్భాషలాడారని ఎంఆర్‌పీఎస్ నాయకులు అబద్ధాలు చెప్పడం సరికాదన్నారు. దళితుల పింఛన్లు పోయాయని ఆ సంఘ నాయకుడు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారని, ఎవరి పింఛన్లు పోయాయో వివరాలు ఇవ్వాలని కోరగా.. తెల్లమొహం వేశాడన్నారు. కడప నగరంలో నాలుగు వేల మందికి నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమేనని, వారిలో అర్హతను నిరూపించుకున్న వారికి పునరుద్ధరించడం జరిగిందన్నారు. 97 పింఛన్లు మాత్రమే పరిశీలనలో ఉన్నాయన్నారు. టీడీపీ, జనసేన మాయలో వారు పడ్డారని, ఆ పార్టీలకు వత్తాసు పలకడం మానుకోవాలని హితవు పలికారు. డిప్యూటీ సీఎంపై విమర్శలు చేస్తే తాము సహించబోమని హెచ్చరించారు. తమ స్వార్థానికి దళితులను వాడుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు ఇ. చైతన్య, త్యాగరాజు, బండిప్రసాద్, చెన్నయ్య, శ్యాంసన్, లక్ష్మీనారాయణ, సీహెచ్ సునీల్, బి.రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు అన్నారు. శనివారం వైఎస్సార్ స్మారక ప్రెస్‌క్లబ్‌లో కడపజిల్లా సమితి సమావేశాన్ని గుంటి వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు,ఉద్యోగులు లేకుండా ఏ దేశం అభివృద్ధి చెందిన దాఖలాలు లేవన్నారు. కార్మిక సంఘాలను పిలిచి వారితో చర్చలు జరిపి వారి సాదక బాధకాలు తెలుసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కోశాధికారి కొండలరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ భారత్ మిషన్ కింద పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరి ఎస్ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. క్లాప్ మిత్రులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్షలు శనివారానికి నాల్గవ రోజుకు చేరుకున్నాయి. స్వచ్ఛ భారత్ కార్మికుల యూనియన్ నాయకులు కెసీ బాదుల్లా, వెంకట సుబ్బయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ



అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరంలో ఫుట్‌పాత్‌లపై జీవనం గడుపుతున్న అనాథలకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శనివారం రాత్రి దుప్పట్లను పంచి పెట్టారు. సంస్థ సభ్యులు, దాత, సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్ సహకారంతో మొత్తం 60 మందికి దుప్పట్లను పంచి పెట్టామని సంస్థ డైరెక్టర్ రాటాల గోపి, నగర అధ్యక్షులు సి.సుబ్బారెడ్డి, డైరెక్టర్ బొడిచర్ల సుబ్బరాయుడు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

కడప రూరల్ : ప్రమాదంలో కాలును కోల్పోయిన బాధితుడికి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచింది. చింతకొమ్మదిన్నె మండలం కృష్ణాపురం ఎస్సీ కాలనీకి చెందిన డొక్కు సుబ్బరాయుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కాలును కోల్పోయారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు శనివారం ఆ గ్రామానికి వెళ్లి సుబ్బరాయుడును పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆ సంఘం నేతలు కొప్పుల శివ, నాగేశ్వరరావు, పస్తుం అంజి, రామాంజనేయులు పాల్గొన్నారు.

అఖిలపక్షాల నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 1ను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం నగరంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద అఖిల పక్ష పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పౌర హక్కులకు భంగం కలిగించే విధంగా రాజ్యాంగ హక్కులు కాలరాయడం సరికాదన్నారు. రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. నగరంలో ప్రజలకు భారంగా మారిన చెత్త పన్ను రద్దు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి సాగు నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ అఖిల పక్ష పార్టీల నాయకులు చంద్ర, సత్తార్, చంద్రశేఖర్, రవి శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడప ఎడ్యుకేషన్ : కందుల విద్యాసంస్థల కోశాధికారి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ జన్మదినం సందర్భంగా శనివారం కళాశాలలలో ఎర్ర మాచుపల్లిలోని ఆశ నిలయంలోని చెవిటి, మూగ పిల్లలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కేఓఆర్ఎం కళాశాల చైర్మెన్ వెంకట శివారెడ్డి, సెక్రటరీ లిఖితరెడ్డి, కళాశాల ప్రధానాచార్యులు వీఎస్ఎస్ మూర్తి, వివిధ విభాగాల హెచ్ఓడీలు, లీనా రాస్తాపూర్, వీర శంకర్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మనసున్న ముఖ్యమంత్రి జగనన్న

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- 42వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం



'గడప గడపకు మన ప్రభుత్వం ' కార్యక్రమంలో ప్రజలకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్ : పేద కుటుంబాల్లో నిన్నకంటే నేడు...నేటి కంటే రేపు బాగుండేలా జగనన్న పాలన సాగుతోందని.. ఆయన మనసున్న ముఖ్యమంత్రి అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం ' కార్యక్రమంలో భాగంగా 42వ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్, నబీకోట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా.. అని ఆరా తీశారు. ఈ సందర్భంగా మునేపల్లి సుబ్బమ్మ అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, పింఛన్ కానుక, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10.92లక్షల లబ్ధి కలిగిందని సంతోషం వ్యక్తం చేసింది. ఏ. నాగవేణి అనే మహిళ మాట్లాడుతూ తమకు జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, పింఛన్ కానుక, సున్నావడ్డీ, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10.10లక్షల మేలు జరిగిందని ఆనందపడింది. షేక్ రహమతున్ బీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పథకాల ద్వారా తమ కుటుంబానికి రూ.9.64లక్షల లబ్ధి జరిగిందని, గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత మేలు జరగలేదన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 42వ డివిజన్ ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు డా. సొహైల్, షఫీ, మియ్యా, శ్రీరంజన్‌రెడ్డి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, క్రిష్ణవేణి, మూలే సరస్వతి, నారాయణమ్మ, రామలక్షుమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని రాయలసీమ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం రాత్రి 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు మాట్లాడుతూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో కూడా ప్రతిభ చూపి సత్తా చాటాలన్నారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను పులివెందుల లయోల పాలిటెక్నిక్ కళాశాల గెలుపొందింది. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగు పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. సీబీఐటీ డిప్లమో కళాశాల ఇన్‌చార్జి రమేష్, ఆర్గనైజర్ మంజునాథ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి పీడీ థామస్, జిల్లాలోని పలు పాలిటెన్నిక్ కళాశాలలకు చెందిన వ్యాయామ అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను గెలిచిన లయోల పాలిటెక్నిక్ కళాశాల

11న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు రాక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 11న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్ర రాజు వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశానికి పీసీసీ అధ్యక్షుడితో పాటు ఏఐసీసీ సెక్రటరి మేయప్పన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు మధు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశానికి కాంగ్రెస్ అన్ని బంధ సంఘాల నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు హాజరు కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుపేత్రం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, నగర ఉపాధ్యక్షుడు మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో బోరుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

కడప కార్పొరేషన్ : కడప నగరం రామాంజనేయపురంలోని జర్నలిస్టు కాలనీలోని నీటి సమస్య పరిష్కారమైంది. ఇక్కడి బోరు పాడవడంతో ఆ కాలనీతోపాటు ఆచారికాలనీ, వరదకాలనీల్లో తాగునీటి సమస్య నెలకొంది. ఆరు రోజులపాటు నీటి కోసం ఈ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఈనెల 5వ తేది రామాంజనేయపురంలో తీవ్ర నీటి ఎద్దడి శీర్షికన 'సాక్షి' వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు నీటి సమస్య ఉన్న ప్రాంతానికి వాటర్ ట్యాంకర్ పంపడంతోపాటు, బోరును వెంటనే మరమ్మతులు చేయించారు. నీటి సమస్య త్వరగా తీరినందుకు స్థానికులు 'సాక్షి'కి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ ఫారెస్ట్ అధికారుల సర్వసభ్య సమావేశం

కడప అర్బన్ : కడప నగరంలోని అటవీశాఖ అతిథిగృహం పంచవటిలో శనివారం కడప డివిజన్ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ డైరీలను పంపిణీ చేయడంతో పాటు, అటవీ అధికారుల వివిధ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను గురించి చర్చించారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రెసిడెంట్ టి. నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రాజు, సెక్రటరీ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాషా, జాయింట్ సెక్రటరీ షాహీన్, భాను, ట్రెజరర్ విశ్వనాథ్, అటవీశాఖాధికారులు పాల్గొన్నారు.

నేడు 5కే వాక్

కడప ఎడ్యుకేషన్ : సీపీఎస్ రద్దు చేయాలనే నినాదంతో ఆదివారం ఉదయం 7 గంటలకు కడప కోటిరెడ్డిసర్కిల్ నుంచి యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే 5కే రన్‌ను విజయవంతం చేయడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరుకావాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విజయకుమార్, పాలెం మహేష్‌లు పిలుపునిచ్చారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు విషయంలో ఆలోచించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సఖి దిశా సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్‌జడ్జి కవిత, ఐసీడీఎస్ పీడీ ఎంఎస్ రాణిల సూచనల మేరకు నగర శివార్లలోని వన్ స్టాప్ (సఖి దిశ) సెంటర్ కార్యాలయంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం ప్రజలకు మహిళలపై లైంగిక వేధింపుల నిరోధం, వయోవృద్ధుల చట్టాలు, బాల్య వివాహ నిరోధకచట్టం, బాల కార్మిక చట్టం, ఉచిత న్యాయ సహాయం, వన్ స్టాప్ సెంటర్‌లో అందించే సేవలు వివరించారు. మహిళా ప్రతినిధులు జ్యోతి, మాధవీలత, శారద, ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.



చట్టాల పట్ల అవగాహన కల్పిస్తున్న సఖి దిశ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు

కడప అర్బన్ : సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు సూచించారు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించారు. లోన్‌యాప్ బారినపడి మోసపోవద్దని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసుశాఖకు అందించాలన్నారు.



యువతకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు

నేడు ఎస్‌టీఎఫ్ ఆవిర్భావ సభ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు నూతనంగా ఏర్పాటు చేయనున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఎస్‌టీఎఫ్) ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఏటీఎఫ్ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల హక్కులు,సంక్షేమ పోరాటం కోసమే నూతనంగా యూనియన్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామలక్ష్మిరెడ్డి, రామచంద్ర, వెంకటసుబ్బయ్య, సాగర్ దిలీప్, మంచా వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య, సివిఎస్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని జ్యోతిరావు పూలే సర్కిల్ వద్ద స్మార్ట్ మీటర్లు ఏర్పాటును ఆపాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేలా రాష్ట్రాలపై ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారునికి అదనపు భారం పడటం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, చంద్రా రెడ్డి, ఓబులేసు, ఫరూక్ హుస్సేన్, జమీల తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలి

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై కడప నగరంలో ఆయన శనివారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి మరింత మేలు చేకూర్చడం కోసం గడప గడపకు కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించి సీఎం ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం ఆయన నియోజకవర్గంలోని మండలాల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధులతో వచ్చిన సమస్యలపై ఆరా తీసి ఒకవేళ సమస్య పరిష్కారం కాకుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఇకపై గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై నెలకొకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు సైతం తమ గ్రామాల పరిధిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని ఆరు మండలాల వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంబీసీ క్యాలెండర్లు ఆవిష్కరణ





ఎంబీసీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్యాస్ట్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాదుల్లా ఆధ్వర్యంలో సంఘ నాయకులు వారిని వేర్వేరుగా కలిసి క్యాలెండర్లు ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా అందలమెక్కించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు బీసీలంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఓ. రసూల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాల పెద్దన్న, ప్రచార కార్యదర్శి కుళ్లాయప్ప, ఉపాధ్యక్షులు కె. మహ్మద్, జిల్లా నాయకులు సిద్దయ్య, అలీబాషా, మల్లిశేఖరే, బాబు మస్తాన్, బాబయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై గొయ్యిని కూడా పట్టించుకోరా!

సచివాలయం వద్ద సీపీఐ నిరసన

కడప వైఎస్సార్ సర్కిల్: కడప నగరంలోని 48వ డివిజన్‌లో పేదలు నివాసం ఉంటున్న బుడగజంగం కాలనీలో రోడ్డుపై కల్వర్టు పగిలిపోయి గొయ్యి ఏర్పడిందని సీపీఐ నగర కార్యదర్శి ఎస్. వెంకటశివ అన్నారు.

శనివారం వార్డు సచివాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ నెలలు గడుస్తున్నా నగర పాలక అధికారులు ఈ గొయ్యిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కల్వర్టు గొయ్యి వల్ల వాహనదారులు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొందరికి కడ్డీలు తగిలి గాయాలపాలయ్యారన్నారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులుఏ కె. మునెయ్య, పి. మల్లికార్జున, బుడగజంగం కాలనీ నాయకులు దస్తగిరి, చెంచయ్య, లక్ష్మయ్య, పాలప్ప, మదార్ పాల్గొన్నారు.

మధుర క్షణం.. మరపురాని ఘట్టం



గోల్డ్‌మెడల్స్ సాధించిన ప్రతిభావంతులు

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ తోటి స్నేహితులతో ముచ్చటిస్తూ.. పట్టాలు, బంగారు పతకాలు అందుకోవడం జీవితంలో మరిచిపోలేని అపురూప ఘట్టమని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ అరుదైన గ్రాడ్యుయేషన్ డే వేడుకలను జీవితాంతం గుర్తుంచుకుంటామన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో ఫొటోలు దిగుతూ విద్యార్థులు సందడి చేశారు. విద్యాలయాన్ని ఎప్పటికీ మరువబోమంటూ.. ముందుకు సాగారు..

– వైవీయూ

ప్రజలపై భారం మోపుతున్న బీజేపీ

సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలపై అధిక భారాలు మోపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మండిపడ్డారు. శనివారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ నగర కమిటీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలపై భారాలు వేసి డబ్బులు దోచి అంబాని, ఆదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు పంచి పెడుతోందని ధ్వజమెత్తారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థల నుంచి ఎన్నికల నిధులను సమకూర్చుకునేందుకే ఇలాంటి విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబరు 1ని ఉపసంహరించుకోవాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు జమీలమ్మ, ఫరూఖ్, ఓబులేశు, కల్యాణ్, వెంకట సుబ్బయ్య, తార, అంజలి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో మహిళా ఓటర్లే కీలకం

వల్లూరు : ఓటరు జాబితా సంక్షిప్త సవరణ–2023 ప్రక్రియలో భాగంగా ప్రకటించిన ఓటరు జాబితాలో ఓటర్ల సంఖ్య పరంగా కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది. 2,59,720 మంది ఓటర్లతో జిల్లా మొత్తం మీద జిల్లా కేంద్రమైన కడప అసెంబ్లీ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలువగా, 2,45,327 మంది ఓటర్లతో జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గం రెండవ స్థానంలో, 2,24,430 మంది ఓటర్లతో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నాలుగవ స్థానంలో నిలిచాయి. కాగా 1,97,034 మంది ఓటర్లతో కమలాపురం నియోజకవర్గం చివరి స్థానంలో నిలిచింది.

మహిళా ఓటర్లే అధికం

కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా వున్నారు. నియోజవర్గంలో మొత్తం 1,97,034 మంది ఓటర్లు వుండగా అందులో 97,071 మంది పురుష ఓటర్లు వుండగా 99,930 మంది మహిళా ఓటర్లు, 33 మంది ట్రాన్స్ జండర్‌లు వున్నారు. నియోజకవర్గం మొత్తం మీద పురుష ఓటర్ల కంటే 2,859 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా వున్నారు. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లోనే గాక అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం మహిళా మణులే కీలక పాత్ర పోషిస్తారని చెప్పక తప్పదు.

పెండ్లిమర్రి మండలంలో భిన్నం

నియోజకవర్గ పరిధిలోని కమలాపురం, వల్లూరు, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, వీరపునాయునిపల్లె మండలాలలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా వుండగా పెండ్లిమర్రి మండలంలో మాత్రం అందుకు భిన్నంగా మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లు ఎక్కువగా వుండడం గమనార్హం. మండలంలో మొత్తం 17,705 మంది పురుష ఓటర్లు వుండగా 17,472 మంది మహిళా ఓటర్లు వున్నారు. ఈ మండలం మొత్తం మీద 233 మంది పురుష ఓటర్లు ఎక్కువగా వున్నారు.



నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి

మండలం	పోలింగ్ స్టేషన్‌ల సంఖ్య	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జండర్లు	మొత్తం
కమలాపురం	59	19997	20857	20	40874
చెన్నూరు	35	14725	15685	4	30414
వల్లూరు	29	10717	11074	3	21794
వీఎన్ పల్లె	31	12218	12732	0	24950
పెండ్లిమర్రి	44	17705	17472	3	35180
సీకే దిన్నె	51	21709	22110	3	43822
మొత్తం	249	97071	99930	33	197034

కడప రాయునికి 'పునర్వసు' పూజలు

కడప కల్చరల్ : కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామికి శనివారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. సువర్ణ ఆభరణాలు, రంగురంగుల పూలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పల్లకిపై కొలువుదీర్చారు. అనంతరం మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో స్వామి, అమ్మవార్లకు అలంకరించిన తమలపాకుల మాల భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.




గ్రామోత్సవంలో పాల్గొన్న స్వామి, అమ్మవార్లు



ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు అల్‌కరాజ్ దూరం

సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌నుంచి వరల్డ్ నంబర్‌వన్, స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్‌కరాజ్ తప్పుకున్నాడు. గత కొంత కాలంగా కుడి కాలి గాయంతో బాధపడుతున్న అతను సరైన సమయంలో కోలుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించాడు. గత ఏడాది సెప్టెంబర్ 12న అల్‌కరాజ్ ఏటీపీ చరిత్రలో అతి పిన్న వయసులో వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. అల్‌కరాజ్ దూరం కావడంతో డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్ ఈ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు.

పంత్ మోకాలికి శస్త్ర చికిత్స



కారు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న భారత క్రికెటర్ రిషభ్ పంత్‌కు ముంబైలో మోకాలి శస్త్రచికిత్స జరిగింది. డాక్టర్ దిన్షా పర్దీవాలా శుక్రవారం ఈ సర్జరీని నిర్వహించారని... ప్రస్తుతం పంత్ అబ్జర్వేషన్‌లో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. అతని రీహాబిలిటేషన్ పూర్తి అయ్యే వరకు పర్దీవాలా తగిన సూచనలు ఇస్తారని, వాటిని బీసీసీఐ డాక్టర్ల పర్యవేక్షణలో అమలు చేస్తారని బోర్డు అధికారి చెప్పారు.

మండే సూర్యుడు...

సూర్యకుమార్ 51 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 112 నాటౌట్

రాజ్‌కోట్: సూర్యకుమార్ యాదవ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆఖరి మ్యాచ్‌లో శ్రీలంక కొట్టుకుపోయింది. టీమిండియా 91 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. టాస్ నెగ్గిన భారత్ మొదట 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ (51 బంతుల్లో 112 నాటౌట్; 7 ఫోర్లు, 9 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. రాహుల్ త్రిపాఠి (16 బంతుల్లో 35; 5 ఫోర్లు, 2 సిక్సులు) మెరిశాడు. అనంతరం శ్రీలంక 16.4 ఓవర్లలో 137 పరుగులకే కుప్పకూలింది. కుశాల్ మెండిస్ (23), షనక (23) టాప్ స్కోరర్లు.

సూర్య ది గ్రేట్ ఇన్నింగ్స్

నాలుగో బంతికి ఇషాన్ కిషన్ (1) వికెట్ తీసిన లంకకు ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. కెరీర్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న రాహుల్ త్రిపాఠి మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా, శుబ్‌మన్ గిల్ (36 బంతుల్లో 46; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మొదటి 9 బంతుల్లో సింగిల్ కూడా తీయలేకపోయాడు! తీక్షణ ఐదో ఓవర్లో 3 బౌండరీలు బాదిన త్రిపాఠి... కరుణరత్నే ఆరో ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. అదే ఊపులో థర్డ్‌మ్యాన్ దిశగా షాట్ ఆడబోయి మధుషంక చేతికి చిక్కాడు. 'పవర్ ప్లే' ఆఖరి బంతికి సూర్య క్రీజులోకి వచ్చాడు. 6 ఓవర్ల పవర్ ప్లేనే అయిపోయింది. మిగతా 14 ఓవర్ల పవర్ స్ట్రోక్స్ ఎలావుం టాయో 'స్కై' చూపెట్టాడు. కవర్ డ్రైవ్, ర్యాంప్ షాట్లతో టచ్‌లోకి వచ్చిన సూర్యకుమార్ స్కోరు బోర్డును ఆద్యంతం పరుగు పెట్టించాడు. స్పిన్, పేస్, గూగ్లీ ఇలా ఏ బంతి వేసిన తన శైలి షాట్లతో చెలరేగిపోయాడు. పేస్‌తో ముఖం మీదికి వచ్చే బంతుల్ని విడిచి పెట్టలేదు. అదే పనిగా ర్యాంప్ షాట్లతో సిక్సులు, ఫోర్లుగా దంచేస్తూ 26 బంతుల్లోనే ఫిఫ్టీని అవలీలగా పూర్తి చేసుకున్నాడు. అతని షాట్లకు ఆకాశమే హద్దయ్యింది. ఫుల్ టాస్ బంతుల్ని, యార్కర్ డెలివరీల్ని మంచినీళ్ల ప్రాయంలా బౌండరీలకు తరలించాడు. ఎలా వేసినా దంచేశాడు. అతని ధాటికి మధుషంక 13వ ఓవర్లో 18 పరుగులు రాగా... తీక్షణ మరుసటి ఓవర్లో 2, 4, 6, 6, 1లతో సూర్య వేగం ఇంకాస్త పెంచాడు. ఆఖరి బంతిని ఆడిన గిల్ బౌండరీ కొట్టడంతో ఆ ఓవర్లో 23 పరుగులొచ్చాయి. కేవలం ఈ రెండు ఓవర్లలోనే భారత్ 113/2 నుంచి 154/2కు చేరింది. హసరంగ 15వ ఓవర్లో గిల్ క్లీన్‌బౌల్డయ్యాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (4), దీపక్ హుడా (4) స్వల్ప వ్యవధిలోనే నిష్క్రమించినా... సూర్య బాదుడుకు అదేమంతా ప్రభావమే చూపలేదు. ఆఖర్లో జతయిన అక్షర్ పటేల్ (9 బంతుల్లో 21 నాటౌట్; 4 ఫోర్లు) చకచకా బౌండరీలు బాదాడు.



సూర్యకుమార్



- చివరి టి20లో 91 పరుగులతో శ్రీలంకపై భారత్ ఘనవిజయం
- 2–1తో సిరీస్ వశం

18వ ఓవర్ చివరి బంతికి భారత్ స్కోరు 200కు చేరగా, 19వ ఓవర్ తొలి బంతికి సూర్యకుమార్ (45 బంతుల్లో; 6 ఫోర్లు, 8 సిక్సర్లు) సెంచరీ పూర్తయ్యింది. పొట్టి ఫార్మాట్‌లో అతనికిది మూడో సెంచరీ కావడం విశేషం.

లంక గిలగిల

భారీ లక్ష్యం చూడగానే శ్రీలంక బ్యాటర్స్ బెదిరినట్లున్నారు. క్రీజులోకి 11 మంది దిగినా... అందులో ఏ ఒక్కరు కనీసం పాతిక పరుగులైనా చేయలేకపోయారు. గత మ్యాచ్‌లో విమర్శలపాలైన భారత బౌలింగ్ ఒక్కసారిగా దెబ్బతిన్న పులిలా పంజా విసిరింది. నిసాంక (15; 3 ఫోర్లు), అవిష్క ఫెర్నాండో (1), ధనంజయ (14 బంతుల్లో 22; 2 ఫోర్లు, 1 సిక్స్), అసలంక (14 బంతుల్లో 19; 2 ఫోర్లు, 1 సిక్స్) కెప్టెన్ షనక, హసరంగ (9) ఎవరు వచ్చినా ఆడింది కాసేపే! భారీ లక్ష్యానికి తగ్గ భాగస్వామ్యం ఒక్కటంటే ఒక్కటైన నిలబడకుండా బౌలర్లు సమష్టిగా దెబ్బ తీశారు. దీంతో కనీసం 17 ఓవర్లయినా పూర్తిగా ఆడలేక ఆలౌటైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) ధనంజయ (బి) మధుషంక 1; గిల్ (బి) హసరంగ 46; త్రిపాఠి (సి) మధుషంక (బి) కరుణరత్నే 35; సూర్యకుమార్ నాటౌట్ 112; హార్దిక్ (సి) ధనంజయ (బి) రజిత 4; హుడా (సి) హసరంగ (బి) మధుషంక 4; అక్షర్ నాటౌట్ 21; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు)** 228. **వికెట్ల పతనం:** 1–3, 2–52, 3–163, 4–174, 5–189. **బౌలింగ్:** మధుషంక 4–0–55–2, రజిత 4–1–35–1, తీక్షణ 4–0–48–0, కరుణరత్నే 4–0–52–1, హసరంగ 4–0–36–1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) మావి (బి) అర్ష్‌దీప్ 15; మెండిస్ (సి) ఉమ్రాన్ (బి) అక్షర్ 23; ఫెర్నాండో (సి) అర్ష్‌దీప్ (బి) పాండ్యా 1; ధనంజయ (సి) గిల్ (బి) చహల్ 22; అసలంక (సి) మావి (బి) చహల్ 19; షనక (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 23; హసరంగ (సి) హుడా (బి) ఉమ్రాన్ 9; కరుణరత్నే (ఎల్బీ) (బి) పాండ్యా 0; తీక్షణ (బి) ఉమ్రాన్ 2; రజిత నాటౌట్ 9; మధుషంక (బి) అర్ష్‌దీప్ 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (16.4 ఓవర్లలో ఆలౌట్)** 137. **వికెట్ల పతనం:** 1–44, 2–44, 3–51, 4–84, 5–96, 6–107, 7–123, 8–127, 9–135, 10–137. **బౌలింగ్:** పాండ్యా 4–0–30–2, అర్ష్‌దీప్ 2.4–0–20–3, శివమ్ మావి 1–0–6–0, అక్షర్ 3–0–19–1, ఉమ్రాన్ 3–0–31–2, చహల్ 3–0–30–2.

చేతన్ శర్మకే మళ్లీ చైర్మన్ పదవి

భారత క్రికెట్ సీనియర్ సెలక్షన్ కమిటీని ప్రకటించిన బీసీసీఐ

18 నవంబర్ 2022...పనితీరు బాగా లేదంటూ చేతన్ శర్మ నాయకత్వంలోని సెలక్షన్ కమిటీని రద్దు చేసి కొత్తగా దరఖాస్తులు కోరిన బీసీసీఐ...

7 జనవరి 2023... సెలక్టర్లలో ఒకడిగా ఎంపిక కావడమే కాదు... కమిటీ చైర్మన్‌గా చేతన్ శర్మ పునర్నియామకం...



ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఐదుగురు సభ్యుల కొత్త సీనియర్ సెలక్షన్ కమిటీని ప్రకటించింది. చేతన్ శర్మ (నార్త్‌జోన్) చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సలీల్ అంకోలా (వెస్ట్), సుబ్రతో బెనర్జీ (ఈస్ట్), శివ్ సుందర్ దాస్ (సెంట్రల్), ఎస్.శరత్ (సౌత్‌జోన్) సభ్యులుగా ఉంటారు. టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యం అనంతరం బోర్డు రద్దు చేసిన కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన చేతన్ శర్మనే మరోసారి చైర్మన్ కావడం విశేషం. అయితే పేరుకు కమిటీ రద్దయినా...ఇదే బృందం న్యూజిలాండ్, బంగ్లాదేశ్ పర్యటనలకు, తాజాగా శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌కు కూడా జట్లను ఎంపిక చేసింది. టీమ్ పేలవ ప్రదర్శనపై జరిగిన సమీక్షా సమావేశంలో కూడా చేతన్ శర్మ పాల్గొన్నాడు.

ఎంపిక జరిగిందిలా...

సెలక్టర్ పదవి కోసం సుమారు 600 దరఖాస్తులు వచ్చినట్లు బీసీసీఐ ప్రకటించింది. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణా నాయక్ సభ్యులుగా ఉన్న బోర్డు క్రికెట్ అడ్వైజరీ కమిటీ ఇందులో అన్ని అర్హతలు ఉన్న 11 మందిని షార్ట్ లిస్ట్ చేసి జనవరి 1 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించింది. చైర్మన్‌గా గరిష్టంగా ఏడాదికి రూ. 1 కోటి వేతనం కావడంతో... ఇంతకంటే ఎక్కువగా ఆర్జిస్తున్న పలువురు మాజీ అగ్రశ్రేణి క్రికెటర్లు సెలక్టర్ కావడానికి ఇష్టపడటం లేదు.

అనుభవమిదీ...

చేతన్ భారత్ తరఫున 23 టెస్టులు, 65 వన్డేలు ఆడి 128 వికెట్లు పడగొట్టగా, సలీల్ అంకోలా 1 టెస్టు, 20 వన్డేలు ఆడి 15 వికెట్లు తీశాడు. 23 టెస్టులు, 4 వన్డేలు ఆడి 1375 పరుగులు చేసిన శివ్ సుందర్ దాస్ నేపథ్యం ఒడిషానే అయినా కెరీర్ చివర్లో విదర్భకు ఆడటంతో సెంట్రల్‌జోన్‌నుంచి అతని పేరును పరిగణలోకి తీసుకున్నారు. సుబ్రతో బెనర్జీ 1 టెస్టు, 6 వన్డేలు ఆడి 8 వికెట్లు పడగొట్టాడు. ఎస్.శరత్ ఒక్కడే అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. అయితే దేశవాళీలో 139 మ్యాచ్‌ల ఘనమైన అనుభవంతో పాటు ఇటీవలి వరకు జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా పని చేయడం కూడా కలిసొచ్చింది.

టాటా ఓపెన్ విజేత గ్రీక్‌స్పూర్



పుణే: భారత్‌లో నిర్వహించే ఏకైక ఏటీపీ టోర్నీ టాటా ఓపెన్ మహారాష్ట్ర (ఏటీపీ 250) శనివారం ముగిసింది. సింగిల్స్‌లో నెదర్లాండ్స్ ఆటగాడు గ్రీక్‌స్పూర్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో గ్రీక్‌స్పూర్ 4–6, 7–5, 6–3 స్కోరుతో బెంజమిన్ బోన్జి (ఫ్రాన్స్)ను ఓడించాడు. 2 గంటల 16 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో తొలి సెట్‌ను కోల్పోయినా...పట్టుదలతో ఆడిన 26 ఏళ్ల గ్రీక్‌స్పూర్ తన కెరీర్‌లో తొలి ఏటీపీ టైటిల్ సొంతం చేసుకోవడం విశేషం. మరో వైపు డబుల్స్‌లో భారత జోడి శ్రీరామ్ బాలాజీ – జీవన్ నెడుంజెళియన్ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో సాండర్ గిల్ – జొరాన్ వీగన్ (బెల్జియం) ద్వయం 6–4, 6–4తో శ్రీరామ్–జీవన్‌లపై విజయం సాధించింది.

దక్షిణాఫ్రికా 149/6

సిడ్నీ: ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లో దక్షిణాఫ్రికా పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగింది. మూడో టెస్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీ టీమ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఖాయా జోండో (39), తెంబా బవుమా (35) మాత్రమే ఫర్వాలేదనిపించారు. ఇప్పటికీ దక్షిణాఫ్రికా మరో 326 పరుగులు వెనుకబడి ఉంది. అయితే ఆసీస్ ఆధిపత్యం కనిపిస్తున్నా...టెస్టు 'డ్రా'గానే ముగియవచ్చు! చివరి రోజు ఆదివారం గరిష్టంగా వేయగలిగే 98 ఓవర్లలో మిగిలిన 14 దక్షిణాఫ్రికా వికెట్లను తీయడం ఆసీస్‌కు అంత సులువు కాదు. అంతకు ముందు వాన కారణంగా లంచ్ వరకు కూడా ఒక్క బంతీ పడలేదు. దాంతో ఓవర్‌నైట్ స్కోరు 475/4 వద్దనే తొలి ఇన్నింగ్స్‌ను ఆసీస్ డిక్లేర్ చేసింది. ఫలితంగా 195 పరుగులతో ఉస్మాన్ ఖాజా నాటౌట్‌గా నిలిచాడు. ఫ్రాంక్‌వారెల్ (197 నాటౌట్), సచిన్ (194 నాటౌట్) తర్వాత కెప్టెన్ ఇన్నింగ్స్ డిక్లరేషన్‌తో 190ల్లో ఆగిపోయిన మూడో ఆటగాడిగా ఖాజా నిలిచాడు.

సినిమా



● పొన్నియిన్ సెల్వన్



● ఆర్ఆర్ఆర్

ఏషియన్ ఫిల్మ్ అవార్డుల్లో రెండు భారతీయ చిత్రాలు

● పొన్నియిన్ సెల్వన్‌కు ఆరు ● ఆర్ఆర్ఆర్‌కు రెండు

పదహారవ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌కు సంబంధించిన నామినేషన్స్ శనివారం వెల్లడయ్యాయి. ఈ అవార్డుల్లో రెండు భారతీయ చిత్రాలు 'పొన్నియిన్ సెల్వన్ 1', 'ఆర్ఆర్ఆర్'కి నామినేషన్స్ దక్కాయి. మణిరత్నం దర్శకత్వం వహించిన 'పొన్నియిన్ సెల్వన్ 1' ఆరు విభాగాల్లో (బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ ఒరిజినల్ మ్యూజిక్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ ఎడిటింగ్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్) నామినేషన్స్ దక్కించుకుంది. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష తదితరులు ముఖ్య తారలుగా ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందింది. తొలి భాగం గత ఏడాది సెప్టెంబరు 30న విడుదలై, దాదాపు 500 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసి బాక్సాఫీస్ రికార్డును సృష్టించింది. కాగా రెండో భాగం 'పొన్నియిన్ సెల్వన్ 2' ఈ ఏడాది ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది. ఇక గత ఏడాది సంచలన విజయం సాధించిన 'ఆర్ఆర్ఆర్' సినిమా రెండు విభాగాల్లో (బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్, బెస్ట్ సౌండ్) నామినేషన్ దక్కించుకుంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2022 మార్చి 25న విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 1300 కోట్ల గ్రాస్‌ను వసూలు చేసిందీ చిత్రం. ఇక ఈ 16వ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌లో నామినేషన్ దక్కించుకున్నవారు అవార్డులూ అందుకుంటారా? అనేది మార్చి 12న తెలుస్తుంది. ఎందుకంటే ఆ రోజు హాంకాంగ్‌లో ఈ అవార్డుల వేడుక జరగనుంది.

బాఫ్టా లాంగ్ లిస్ట్‌లో ఆర్ఆర్ఆర్


95వ ఆస్కార్ అవార్డుల షార్ట్ లిస్ట్ (నాటు నాటు పాట), గోల్డెన్ గ్లోబ్ నామినేషన్స్.. ఇలా ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం మరో ఘనతను సాధించింది. 2023 బాఫ్టా (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) లాంగ్ లిస్ట్‌లో చోటు దక్కించుకుంది. నాన్ ఇంగ్లిష్ విభాగంలో 'ఆర్ఆర్ఆర్'కు చోటు దక్కింది. ఇదే విభాగంలో సౌత్ కొరియన్ ఫిల్మ్ 'డెషిసన్ టు లీవ్' ఉంది. ఇక ఈ బాఫ్టా లాంగ్ లిస్ట్ డాక్యుమెంటరీ జాబితాలో ఇండియాకు చెందిన 'ఆల్ దట్ బ్రీత్స్' కూడా ఉంది. ఈ ఏడాది జనవరి 19న బాఫ్టా నామినేషన్స్ రానున్నాయి. ఫిబ్రవరి 19న అవార్డుల ప్రదానం జరుగుతుంది. మరి.... లాంగ్ లిస్ట్‌లో ఉన్న చిత్రాలు నామినేషన్ దక్కించుకుని, అవార్డూ దక్కించుకుంటాయా అనేది చూడాలి.

సౌత్ కొరియన్ మూవీకి 10 నామినేషన్లు

16వ ఏషియన్ ఫిల్మ్ అవార్డ్స్‌లో సౌత్ కొరియన్ థ్రిల్లర్ 'డెషిసన్ టు లీవ్' చిత్రం 10 విభాగాల్లో (బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ యాక్టర్, బెస్ట్ యాక్ట్రస్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ ఎడిటింగ్, బెస్ట్ ఒరిజినల్ మ్యూజిక్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ సౌండ్) నామినేషన్స్ దక్కించుకుంది. ఇదే సినిమా 95వ ఆస్కార్ అవార్డుల్లో ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో షార్ట్ లిస్ట్ కావడం మరో విశేషం. అంతే కాదు.. ఈ ఏడాది కేన్స్ చిత్రోత్సవాల్లో బెస్ట్ డైరెక్టర్ అవార్డును ఈ చిత్రదర్శకుడు పార్క్ చాన్ వూక్ అందుకున్నారు.

అయ్యో ఏంటో ...

సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ జంటగా అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వం వహించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అయ్యో ఏంటో నాకు' అనే లిరికల్ పాటను శనివారం విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, స్వీకర్ అగస్తి పాడారు. ''పెళ్లి నేపథ్యంలో సాగే ఆహ్లాదకర కథతో నూతన దర్శకుడు అనిల్ కుమార్ ఈ చిత్రం రూపొందించారు. సంక్రాంతి పండగకి వస్తున్న మా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.




● సంతోష్

ఆ ఇద్దరిలా నేనూ సపోర్ట్ లేకుండా వచ్చా!

– దర్శకుడు బాబీ

"చిరంజీవిగారి జడ్జిమెంట్ పక్కాగా ఉంటుంది. 153 సినిమాలు చేసిన అనుభవం ఆయనది. అలాంటి చిరంజీవిగారు నేను చేసిన 'వాల్తేరు వీరయ్య' ఫైనల్ కాపీ చూస్తున్నారన్నప్పుడు రెండు రాత్రులు నిద్రపట్టలేదు. సినిమా చూశాక చిరంజీవిగారు నన్ను హత్తుకుని 'బ్లాక్ బస్టర్ కొడుతున్నాం బాబీ' అన్నారు.. ఆ మాటతో గర్వంగా ఫీలయ్యాను" అని డైరెక్టర్ బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా రవితేజ కీలక పాత్రలో నటించిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న రిలీజ్ కానున్న సందర్భంగా బాబీ చెప్పిన విశేషాలు.



● చిరంజీవిగారికి ఒక ఫ్యాన్ బాయ్‌గా 2003లో నా ప్రయాణం మొదలైంది. ఆయన సినిమాలో ఏదో ఒక విభాగంలో పని చేయాలనే కల ఉండేది. అలాంటిది మెగాస్టార్‌ని నేను డైరెక్ట్ చేసిన 'వాల్తేరు వీరయ్య' విడుదలవుతుండటం నా జీవితంలో స్పెషల్ మూమెంట్. ప్రెస్‌మీట్‌లో చిరంజీవిగారు నన్ను కౌగలించుకొని ముద్దు పెట్టుకున్న ఫోటోని ఫ్రేమ్ కట్టించుకుని ఇంట్లో, ఆఫీసులో పెట్టుకున్నా. ● 'వాల్తేరు వీరయ్య' కథని లాక్‌డౌన్‌కి ముందు చిరంజీవిగారికి చెప్పాను. అయితే లాక్‌డౌన్‌లో ప్రేక్షకులు ఓటీటీకి, డిఫరెంట్ కంటెంట్‌కి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో అందర్నీ అలరించే కథ చెప్పాలని దృష్టి పెట్టాం.. ఆ ఆలోచనల నుంచి రవితేజగారి పాత్ర పుట్టింది. ఇద్దరి పాత్రలని సమానంగా డిజైన్ చేశాను. బీ, సీ సెంటర్ ఆడియన్స్‌తో పాటు మల్టీప్లెక్స్ ప్రేక్షకులని కూడా అలరించే అన్ని వాణిజ్య అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ● చిరంజీవిగారు హిట్‌కి పొంగిపోరు.. ఫ్లాప్‌కి నిరుత్సాహపడరు. రవితేజగారూ అంతే. ఏ సినిమాకైనా ఇద్దరూ ప్రాణం పెట్టి చేస్తారు. ఎలాంటి నేపథ్యం లేకుండా స్వయంకృషితో ఎదిగిన చిరంజీవి, రవితేజగార్లలా నేను కూడా ఏ సపోర్ట్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాను. వాళ్లిద్దరితో సినిమా చేయడం నా అదృష్టం. ● సంక్రాంతికి పోటీ ఉంటుంది.. వేరే నిర్మాతలు అయితే ఒత్తిడి ఉండొచ్చేమో? అయితే నవీన్, రవిగార్లు కావడంతో ఒత్తిడి లేదు. 'వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి' చిత్రాలకు నిర్మాతలు ఒక్కరే కాబట్టి రెండు సినిమాలూ బాగుండాలని పాజిటివ్‌గా ఎదురు చూస్తున్నాం. గోపీచంద్ డైరెక్టర్‌గా, నేను రచయితగా ఇద్దరం చాలా కాలం ప్రయాణం చేశాం. మేమిద్దరం ఒకే బ్యానర్‌లో రెండు చిత్రాలతో సంక్రాంతికి రావడం హ్యాపీగా ఉంది. ఒకరికొకరం ఆల్ ది బెస్ట్ చెప్పుకున్నాం. ● చిరంజీవిగారిని అభిమానించే ఫ్యాన్స్ రవితేజగారిని కూడా అభిమానిస్తారు. చిరంజీవిగారి స్ఫూర్తితో ఈ స్థాయికి ఎదిగానని రవితేజగారు ఎన్నో సార్లు చెప్పారు. సైడ్ క్యారెక్టర్స్ చేసుకునే రవితేజగారు స్టార్ హీరోగా ఎదగడం చిరంజీవిగారికి కూడా ఆనందమే. ఇద్దరికీ హిందీలో మంచి మార్కెట్ ఉంది కాబట్టే ఈ చిత్రాన్ని బాలీవుడ్‌లోనూ రిలీజ్ చేస్తున్నాం.

త్రిష కాదు.. కాజల్?

అజిత్ అరవైరెండో సినిమాలో కథానాయిక ఎవరు? కొన్ని రోజులుగా చెన్నై కోడంబాక్కమ్‌లో జరుగుతున్న చర్చ ఇది. ముందుగా నయనతార పేరు వినిపించింది. ఆ తర్వాత త్రిష పేరు తెరపైకి వచ్చింది. ఇప్పుడు కాజల్ అగర్వాల్ పేరు ప్రచారంలోకి వచ్చింది. అజిత్ 62వ చిత్రానికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించనున్నారు. ఇందులో అజిత్ సరసన హీరోయిన్, విఘ్నేష్ భార్య నయనతార నటిస్తారనే ప్రచారం జరిగింది. కారణాలు బయటకు రాలేదు కానీ నయనతార నటించడంలేదట. ఆ తర్వాత త్రిషను సంప్రదించాలనుకున్నారని సమాచారం. అయితే త్రిష కూడా కాదట. కాజల్ అగర్వాల్‌ని ఫైనలైజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందని సమాచారం. తల్లయ్యాక కాజల్ కొంత బ్రేక్ తీసుకుని, ఇప్పుడు మళ్లీ షూటింగ్స్ చేయడానికి రెడీ అయ్యారు. ప్రస్తుతం కమల్‌హాసన్‌తో ఆమె 'ఇండియన్ 2' చేస్తున్నారు. ఇక గతంలో అజిత్ సరసన కాజల్ 'వివేకం' (2017)లో నటించారు. సో.. మరోసారి ఈ జోడీ కుదురుతుందా? కొన్ని రోజుల్లో తెలిసిపోతుంది.





కొత్తవారిని ప్రోత్సహించాలి

– మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

"**తె**లుగు సినిమా పరిశ్రమకు కొత్త తరం అవసరం చాలా ఉంది. కొత్తవారు చేస్తున్న ఈ 'అష్టదిగ్బంధనం' సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. ఎందుకంటే కొత్తవారు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రోత్సహించినప్పుడే మరిన్ని కొత్త సినిమాలు వస్తాయి'' అని తెలంగాణ సినిమాటోగ్రఫీ మినిస్టర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సూర్య భరత్ చంద్ర, ఇషికా ముఖ్య తారలుగా బాబా పీఆర్ దర్శకత్వంలో మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మిస్తున్న చిత్రం 'అష్టదిగ్బంధనం'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విడుదల చేశారు. మనోజ్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ – ''ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచనున్నాం. ఒక వినూత్న కథాంశంతో బాబా పీఆర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం షూటింగ్ పూర్తయింది'' అన్నారు. ''హైదరాబాద్ నేపథ్యంలో సాగే హై వోల్టేజ్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ ఇది'' అని బాబా పీఆర్ అన్నారు. ''నటనకు అవకాశం ఉన్న పాత్ర చేస్తున్నాను'' అన్నారు సూర్య భరత్ చంద్ర. ''తెలుగులో నాకు ఇది మూడో సినిమా'' అన్నారు ఇషికా.

సంగీత దర్శకుడు చాంద్ బాషా మృతి



నృత్యదర్శకురాలు సుచిత్ర తండ్రి, గేయ రచయిత చంద్రబోస్ మామ, సంగీత దర్శకుడు చాంద్ బాషా (92) మృతి చెందారు. హైదరాబాద్ మణికొండలోని ఆయన స్వగృహంలో శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. చాంద్ బాషా దక్షిణాదిలో పలు సినిమాలకు సంగీత దర్శకునిగా చేశారు. తెలుగులో 'ఖడ్గ తిక్కన, బంగారు సంకెళ్లు, స్నేహమేరా జీవితం, మానవుడే దేవుడు', కన్నడంలో 'అమర భారతి, చేడిన కిడికి' వంటి పలు చిత్రాలకు స్వరాలందించారాయన. చాంద్ బాషాకి ముగ్గురు అమ్మాయిలు, ఒక కొడుకు ఉన్నారు. వారిలో సుచిత్ర కొరియోగ్రాఫర్‌గా, డైరెక్టర్‌గా (2004లో 'పల్లకిలో పెళ్లికూతురు' సినిమా తెరకెక్కించారు) సుపరిచితమే. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో శనివారం ఉదయం చాంద్ బాషా అంత్యక్రియలు జరిగాయి. కాగా ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.